పరుష వాక్యాలు వారినోటి నుండి రావు వారు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మీ భక్తిని పూజగదికి పరిమితం చేసుకోవద్దు. భగవదనుభవం పొందటానికి మీ దైనందిన జీవితంలో ఏదైతే అడ్డువస్తోందో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మీకు సంతోషం రావచ్చు, దుఃఖం రావచ్చు, గత జన్మకి దీనికి సంబంధం ఉంటుంది. కాల ప్రవాహంలో అదీపోతుంది, ఇదీపోతుంది. దానిని బట్టి మీమనస్సును పుండుచేసుకోవద్దు, కంగారు పడవద్దు. మీ లక్ష్యాన్ని, గమ్యాన్ని మర్చిపోవద్దు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-4-2000, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శ్రీరామనవమి, రామచంద్రస్వామి భూమిమీద అవతరించిన రోజు, ఆదికావ్యం రామాయణం. వేదాలు, రామాయణం వేరుకాదు. వేదాల యొక్కసారం రామాయణం. వేదాలలో ప్రతిపాదించిన పురుషోత్తముడు రాముడు. ఆంజనేయస్వామిని సమర్థసద్గురువు అని బాబా చెప్పారు. సమర్థసద్గురువు అని ఎందుకు పేరు పెట్టాడు అంటే సీతమ్మ జీవుడు, రాముడు దేవుడు ఈ జీవుడిని పరమాత్మలో ఐక్యం చేసినవాడు ఆంజనేయస్వామి అందుచేత ఆయన సమర్థసద్గురువు. నిజమైన గురువు చేసే పని ఏమిటి అంటేజీవుడిని పరమాత్మలో ఐక్యం చేయాలి. ఆంజనేయస్వామికి మంగళవారం ప్రీతి అని చెపుతూ ఉంటారు. లంకలోనికి వచ్చి మొట్టమొదట సీతమ్మకు రాముడు యొక్క క్షేమంగురించి చెప్పిన రోజు మంగళవారం. అప్పడు సీతమ్మ ఏమి చెప్పింది అంటే ఈ రోజు మంగళవారం, ఈ రోజు రామచంద్రస్వామి యొక్క క్షేమంగురించి తెలియపరచావు అందుచేత ఈ రోజు ఎవరైతే నిన్ను ఆరాధిస్తున్నారో వారికి అన్ని కోరికలు నెరవేరుగాక అని సీతమ్మ వరం ఇచ్చింది. మన శిరస్సు లంక, అయోధ్య ఆధ్యాత్మిక హృదయం ఇప్పడు మనం లంకలో ఉన్నాము. అయోధ్య లోనికి ప్రయాణం చేయాలి. అంటే శిరస్సుండి హృదయంలోనికి ప్రయాణం చేయాలి. ఆ ప్రయాణం చేయటానికి సహకరించే వాడే

ఆంజనేయస్వామి అందుచేత ఆంజనేయస్వామిని సమర్థసద్గురువు అని బాబా చెప్పారు. శిరస్సులో ఉన్న జీవుడిని తన మూలస్థానమైన పాదంలోనికి అంటే తన స్వస్థానంలోనికి గురువు సహాయంతో తీసుకొని వెళ్ళాలి.

దైనందిన జీవితంలో మనం చేసే పనిని హడావుడిగా, కంగారుగా చేయకూడదు. రోజూ చేసే పనులు ప్రేమగా చేయాలి, ధార్మికమైన నిర్మలత్వంతో చేయాలి. ఏదో మనకు కలిసి వస్తుంది అంటే పనులు చేయకూడదు, ఆడంబరంగా చేయకూడదు. ధర్మబుద్ధితో చేయాలి. కొంతమంది తపస్సులు చేస్తారు లోపల శత్రుత్వం పెట్టుకొని చేస్తారు. పూర్వం ఒక గ్రామంలో ఇద్దరు శత్రువులు తపస్సు చేసారట. భగవంతుడు ఒకరికి దర్శనం ఇచ్చి నీకు ఏమి కావాలి అని అడిగాడు. ఇక్కడ ఇంకో వ్యక్తి తపస్సు చేస్తున్నాడు మీరు అతని దగ్గరకు వెళ్ళారా అని అడిగాడట. ముందు నీ దగ్గరకు వచ్చాను నీకు ఏమి కావాలో చెప్ప అని భగవంతుడు చెప్పాడు. అయితే అతను ఏమి కోరుకొంటే దానికి రెట్టింపు నాకు ఇవ్వండి అని చెప్పాడట. అప్పుడు భగవంతుడు రెండో వ్యక్తికి దర్శనం ఇచ్చి నీకు ఏమి కావాలో కోరుకో అని అన్నాడట. ఇక్కడ ఇంకోవ్యక్తి తపస్సు చేస్తున్నాడు వాడి దగ్గరకు వెళ్ళారా అని అడిగాడట. అతని దగ్గరకు వెళ్ళాను నీవు ఏమి కోరుకొంటే దానికి రెట్టింపు ఇవ్వమని అడిగాడు అని చెప్పాడట. అయితే నాకు ఒక కన్ను తీసివెయ్యండి అని అడిగాడట. అంటే వాడికి రెండు కళ్ళు పోతాయి శత్రుభావన ఎలా ఉందో చూడండి. తపస్సుచేస్తున్నారు కాని లోపల శత్రుత్వభావన పోలేదు. ఈ శత్రుత్వ భావన కొన్ని వేల జన్మలను తీసుకొని వస్తుంది. చేతితో మంచి పని చేయాలి, అది ప్రేమతో చేయాలి. హృదయంలో మంచి ఉద్దేశం ఉండాలి. వాంఛతో, అశాంతచిత్తముతో నీవు మంచి పనిచేసినా అది చెడ్డగా మారిపోతుంది. కొంతమందికి కారణం ఉండదు ఎప్పుడూ విసుగుగా, చిరాకుగా ఉంటారు. వారికి జ్ఞానంరాదు. నీలోపల ఉన్న వస్తువు ఎంత పవిత్రంగా ఉందో నీవు చేసే ప్రయత్నం కూడా అంత పవిత్రంగా ఉండాలి. నీవు అవలంబించే మార్గం చెడ్డగా ఉంటే నీవు ఏ ఫలితాన్ని అయితే కోరుకొంటున్నావో ఆ ఫలితం కూడా చెడ్డగా పరిణమిస్తుంది.

కలియుగం రోజులు బాగాలేవు, రోజులు మంచివి కావు అని అంటారు. నీ బుద్ధి

మంచిది అయితే నీవు కలియుగంలో ఉన్నా త్రేతాయుగంలో ఉన్నట్లే ఉంటుంది. కాలంలో మార్పులేదు, నీ బుద్ధిలో మార్పు వచ్చింది. నీ బుద్ధిని సరిచేసుకొంటే ఏ కాలంలో ఉన్న నీవు వైకుంఠంలో ఉన్నట్లే ఉంటుంది. నీ లోపలఉన్న చైతన్యానికి బంధంలేదు. దేహాభిమానమే బంధం. నీకు వైరాగ్యం కలుగచేసి, అభ్యాసం చేసే శక్తిని ఇచ్చి నీలో ఉన్న దేహాభిమానాన్ని తొలగించేవాడే గురువు. అప్పుడు గాని నీకు ఆత్మనిష్ఠ కలుగదు. నిష్ఠకలిగితే నీ మనస్సు ఆత్మవైపుకు మళ్ళిపోతుంది. మనం పోగొట్టు కోవలసింది మనస్సునే అందుచేత మన మనస్సును మనం లెక్కచేయకూడదు ఎందుచేతనంటే అది మనం కాదు. మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వకూడదు. మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా ఉండాలంటే ఆ బలం మనకు గురువేఇవ్వాలి. రామాయణం ఎందుకు చదవమన్నారు రాముడుఎలా ప్రవర్తించాడో మనం కూడా అలా ప్రవర్తిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. రాముడు బంగారు లేడి వెనుక పరుగుపెట్టాడు అనుకొంటాము. కాని మనకు ప్రతీది రోడ్డుమీద ఉన్న గడ్డపరక కూడా బంగారంగా కనిపిస్తుంది. లక్షణస్వామి ఒక గీత గీసి దానిని దాటి వెళ్ళవద్దు అని సీతమ్మకు చెప్పాడు. దాని అర్థం ఏమిటి అంటే నీకు అధికారం ఉన్నా, ధనం ఉన్నా నీవు హద్దులు దాటి వెళితే సీతమ్మకు పట్టిన గతే నీకు పడుతుంది అని చెప్పటం. నీ దేహానికి కేన్సర్ వచ్చింది అనుకో దానిని తొలగించుకోకపోతే అది నీ శరీరాన్ని ఎంత బాధపడుతుందో నీ మనస్సులో ఉన్న దురభ్యాసములు, దురలవాట్లు ఈ జీవుడిని అంత బాధపెడతాయి. శరీరానికి ఎన్ని రోగములు ఉన్నా స్మశానంలో శరీరం కాలినప్పుడు అవి కూడా పోతాయి. కాని నీ మనస్సులో ఉన్న దురలవాట్లు, దురభ్యాసములు జన్మాంతరములోనికి వచ్చేస్తాయి.

ప్రారబ్దం., సంచితం,. ఆగామి అని మూడు కర్మలు ఉన్నాయి కదా. ప్రారబ్ధం ఎవడైనా అనుభవించి తీరాలి అని చెపుతారు. ఈ జన్మలో జ్ఞానం కలిగింది అనుకోండి సంచితం పోతుంది, అగామి పోతుంది కాని ఏ కర్మానుభవం కోసం ఈ దేహం వచ్చిందో ఎంతటి వారైనా అది అనుభవించే తీరాలి అని శాస్త్రం చెపుతోంది. దానిని భగవాన్ ఏమాత్రం అంగీకరించలేదు. అసలు కర్మ అనుభవించేవాడు ఎవడు? దేహబుద్ధి

ఉన్నవాడు కర్మ అనుభవిస్తాడు, దేహబుద్ధి లేనివాడిని ప్రారబ్ధం ఏమి చేస్తుంది అన్నారు. అయితే ఇప్పుడు మీరు కాన్సర్‌తో బాధపడుతున్నారు కదా అని అడిగారు. భగవాన్ కాన్సర్‌తో బాధపడుతున్నారని చూసే వారికి ప్రారబ్దకర్మ కనబడుతోంది కాని అనుభవించటానికి లోపల ఎవడూ లేడుకదా, వాడు ఏనాడో చనిపోయాడు. జ్ఞాని ప్రారబ్దమును అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అనుకొంటాడు కాని అనుభవించేవాడు అక్కడలేడు. ప్రారబ్దం ఎవరికి అంటే అహంకారానికి. అదిపోతే అనుభవించేవాడు అక్కడ లేడు. దేహం పోయేవరకు ఆగనక్కరలేదు దేహం ఉండగా దేహాభిమానం పోతే ప్రారబ్దకర్మ వాడిని ఏమీ చేయలేదు. మీరు శిలువ వేయవలసింది మీ దేహానికి కాదు, మీ అహంకారానికి శిలువ వేయండి, దేహాభిమానానికి శిలువ వేయండి అప్పడు మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అగ్నికంటే గొప్పవాడు సత్పురుషుడు అని చెపుతారు. అగ్ని మనకు వెలుగునిస్తుంది. దానితోపాటు వేడిని కూడా ఇస్తుంది. కాని సత్పురుషుడు మనకు వెలుగును ఇస్తాడు, వేడిని ఇవ్వడు.

కబీరు దగ్గరకు ఒక భక్తుడు వచ్చి మేము యాత్రలకు వెళుతున్నాము., మీరు కూడా రండి అని అడిగాడు. ఇప్పడు నేను రాలేను అని చెప్పి అక్కడ ఉన్న ఒక చేదుదోసకాయను వారికి ఇచ్చి దీనిని మీతో పాటు తీసుకొని వెళ్ళండి. మీరు ఏ నదులలో స్నానం చేస్తే అందులో దీనిని కూడా ముంచండి. మీరు ఏగుడికి వెళితే ఆగుడికి దీనిని తీసుకొని వెళ్ళి అక్కడ ఉన్న దేవుడికి ఈ దోసకాయను చూపించండి. మీరు తిరిగి వచ్చిన తరువాత నా దోసకాయను నాకు ఇచ్చేయండి అని చెప్పాడు. అలాగే వారు యాత్రలు చేసి వచ్చి దోసకాయను తిరిగి కబీరుకు ఇచ్చేసారు. కబీరు ఆ దోసకాయను కోసి అందరికీ తినమని ఇచ్చాడు. దోసకాయ ఎలా ఉంది అని కబీరు వారిని అడిగాడు. చేదుగా ఉంది అని చెప్పారు. ఇది యాత్రలు చేసింది దానిలో ఉన్న చేదు పోయిందా పోలేదు అంటే దాని బుద్ధిపోలేదు అలాగే మీ బుద్ధులు కూడా అంతే. మీకు లోపల బాగుపడాలనే బుద్ధి లేకుండా యాత్రలు చేస్తే ఇలాగే ఉంటుంది. యాంత్రికంగా పనులు చేయకూడదు. యాంత్రికంగా చేస్తే దోసకాయలాగే మన బుద్ధి మారదు. ముందు

మనకు బాగుపడాలనే బుద్ధి ఉండాలి. మనం పవిత్రులం అవ్వాలనే బుద్ధి ఉంటే ఎంతో కొంత మనకు పవిత్రత వస్తుంది.

దేవుడు లేడు, దేవుడు లేడు అని కొంతమంది చెపుతూ ఉంటారు. దేవుడు లేడు అని చెప్పేవాడికి కూడా మమకారం ఉంది కదా. దేవుడు లేడు అని చెప్పే బదులు సాధన చేసి వాడికి ఉన్న మమకారం పాగొట్టుకొంటే వాడు దేవుడితో సమానం అవుతాడు. పూర్వజన్మలో మనం మంచి చేసి ఉండవచ్చు, చెడు చేసి ఉండవచ్చు. ఈ దేహంలో కొంత అనుభవిస్తున్నాము. ఇంకేమీ లేదు అని మీరు అనుకోవద్దు. రాబోయే జన్మలలో మీరు అనుభవించవలసిన కర్మ చాలా ఉంది. డబ్బాలో బియ్యం అయిపోతే అయిపోయింది అనుకోకండి. గాదెలో వడ్లు రెడీగా ఉన్నాయి. ఒకే శరీరంలో మీరు ఆ కర్మ అంతా అనుభవించలేరని పాపండబ్బాలో కొంచం బియ్యం, పుణ్యండబ్బాలో కొంచం బియ్యం కలిపి మీకు దేహాన్ని భగవంతుడు ఇచ్చాడు. ఏదో కొన్ని రోజులు కాలక్షేపం చేస్తే మనం చనిపోతాము తరువాత ఇంక కర్మలేదు అని మీరుఅనుకోవద్దు. గాదిలో నుండి సప్లయి అవుతుంది. వేటగాడు ఏ విధంగా జంతువును వెంటాడుతాడో ఆ జంతువును చంపటానికి అలాగ కర్మానుభవం ఎవడైతే అనుభవిస్తున్నాడో వాడిని వెంటాడి వేటాడి వాడిని సంహరించి నప్పడు కర్మ తప్పకొంటుంది గాని లేకపోతే నీవు కోటిజన్మలు ఎత్తినా కర్మ నిన్ను వదలదు. మీలో మీకు తెలియని మంచి గుణాలు, చెడు గుణాలు ఉండవచ్చు. అవి మీకు కనబడటం లేదు కాబట్టి అవి లేవు అనుకొంటున్నారు. ఏజన్మకు ఆ జన్మ అవి వస్తూనే ఉంటాయి. గుణాల జోలికి వెళ్ళవద్దు. ఈ గుణాలు అన్నీ నేను అనే తలంపును అంటిపెట్టుకొని ఉంటాయి. దానిని విచారణ చేసి వేరుతో సహా తొలగించుకో. అప్పడు ఏ గుణాలు నిన్ను ఏమీ చేయలేవు. అనుభవించేది జీవుడు, అనుభవింపజేసేది ఈశ్వరుడు ఎప్పడు ఎక్కడ అది నీకు అనుభవింప చేయాలో నిర్ణయించేది ఈశ్వరుడు. ఈ లోపుగా గురువు అనుగ్రహం వలన నీకు బ్రహ్మానుభవం కలిగింది అనుకో అప్పడు అనుభవించేవాడు లేడు, అనుభవింపజేసే వాడు లేడు. మనస్సులో మాయ ఉన్నప్పడు జగత్తు ఉంది., జీవుడు ఉన్నాడు, ఈశ్వరుడు ఉన్నాడు, కర్మానుభవం ఉంది. మనస్సులో

మాయలేనప్పడు ఏదీ లేదు. ప్రభువా మా పొరపాట్లు క్షమించి మమ్మల్ని ఆశీర్వదించు అంటారు. ఈశ్వరుడు వారి పొరపాట్లను క్షమించాడు అనుకోండి వారికి పునర్జన్మలు తేలికగా ఉంటాయి, క్షమించకుండా అలాగే ఉంచేస్తే రాబోయే జన్మలలో అవి బండరాళ్ళుగా తయారవుతాయి. ఈశ్వరుడు నీవు చేసిన కర్మను తీసివేయడు, లేని దానిని చేర్చడు. కర్మానుభవం ఈజన్మలో దాటిపోతే ఇంకరాదుఅనుకోవద్దు. ఏదో జన్మలో ఈశ్వరుడు కలుగచేస్తాడు. ఈ గొడవలు నీకు ఎందుకు? కర్మ ఎవరికైతే అనుభవం లోనికి వస్తోందో వాడిని తొలగించుకొంటే ఏమీ లేదు. నీవు పుణ్య కర్మలు చేస్తున్నావు అనుకో మంచి కర్మలు చేస్తున్నావు అనుకో నీవుచేసిన మంచిపనులను సహాయంగా తీసుకొని ఆధ్యాత్మిక అభివృద్ధి పొందాలనే గుణం నీకు కలుగజేస్తాడు, ఆధ్యాత్మిక మార్గంలో అభివృద్ధిలోనికి రావాలనే వేదన లోపలనుండి కలుగజేస్తాడు. భగవంతుడు చేసే సహాయం అది ఏది శాశ్వతంగా ఉంటుంది అంటే ఒక్క ధర్మం మాత్రమే శాశ్వతంగా, స్థిరంగా ఉంటుంది. మిగతావి అన్నీ కూడా నీవు చేసే మంచి పనులు, చెడు పనులు అన్నీ కూడా కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-4-2000, రాజోలు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మత సమైక్యతకోసం ఎక్కువ కృషి చేసిన సెయింట్స్‌లో షిర్డీబాబా ఒకరు. ఆయన రాముడికి, అల్లాకు ఎప్పుడూ బేధం చూడలేదు. మతబేధాలు ఎవరైనా తీసుకొనివస్తే ఆయన సహించేవారు కాదు. వాటిని ఖండించేవారు. వేరేమతం వాడిని మన మతంలోనికి లాగేసాను అని ఎవరైనా చెపితే నీకు బుద్ధిలేదా మతం మార్చటం అంటే తల్లిదండ్రులను మార్చుకొన్నట్లే అని బాబా చెప్పేవారు. మీరు ఏ మతంలో ఉన్నారో ఆ మతంలో తరించటానికి తగిన సామాగ్రి ఉంది, ఆ దేవుడిని ప్రార్థించుకోండి, మీరు బాగుపడండి అంతే గాని మతాలు మార్చుకోవద్దు. ముస్లిములు బాబా మావాడు అని